# ఎయిర్ హోస్టెస్

ఆమె వక్షస్థలం వైపు అట్లా గుచ్చిగుచ్చి చూడటం అంత మర్యాదకాదు కానీ, అట్లా కానప్పుడు ఆ "నేమ్‌ప్లేట్" మీద ఏమి వ్రాసి ఉందో ఎట్లా తెలుస్తుంది? ఇంగ్లీష్ పెద్ద అక్షరాల్లో "అనామిక" అని వ్రాసి ఉంది ఆ ప్లేట్‌మీద. పాపం పేరు లేని అమ్మాయి అనే అర్థం వచ్చే ఆ పేరు చూసినా గానీ, ఎవరికీ ఆమెపట్ల దయగానీ, సానుభూతి గానీ, కరుణ గానీ కలగవు. ఇహ స్వభావం అంటారా? ఆ ప్రస్తావన లేకపోవడమే మంచిది. కయ్యానికి కాలు దువ్వే ఆమె నైజం. ఆ నేమ్‌ప్లేటును చదివే వ్యక్తి ఒక డాక్టరైనా "అనీమియా" అని చదవడానికి అవకాశం లేదు. చూపులకు ఆమె ఒక నల్లటి, పొట్టి పిపాలాగా ఉంటుంది.

నల్లటి, పొట్టి పీపా అంటే? నల్లటి అనే పదానికి వేరే అర్థాలు ఏమీ ఉండవు; నలుపు అంటే నలుపే. కానీ, ఆ నలుపులో కూడా నానా రకాలు ఉంటాయి గదా!.... తారు నలుపు, కారు నలుపు, కాటుక నలుపు, బొగ్గునుసి నలుపు, చీకటి నలుపు ఇట్లా... ఈమె ఛాయ కారు నలుపుకు, బొగ్గు నుసి నలుపుకు మధ్యస్థంగా ఉంటుందేమో! ఎవరో ఒక కవి ఎప్పుడో చెప్పాడట, నలుపుకు నాలుగు రకాల అందాలుంటాయని...., ఆ విధంగా ఎట్లా ఊహించ గలిగాడతను? మత్తులో మునిగి చెప్పి ఉంటాడేమో! లేక చిత్రకారుడేమో! మనోహరమైన చిత్రాన్ని చిత్రించాలన్న తాపత్రయంలో ఒక పరిమాణం లేకుండా సప్తవర్ణాల్ని సమ్మిశ్రితం చేసినందువల్ల ఒక నల్లని రూపం సాక్షాత్కరించేటప్పుడు "ఓ శ్యామసుందరీ! ఓ నీలి కురుల సిరుల భామినీ! నీ ప్రాణనాథుడు ప్రాగ్దిశన ఉదయిస్తాడు" అంటూ రాగం తీశాడేమో! ఆమెపట్ల రూప వర్ణనకు వాడిన ఈ రెండు విశేషణాలు సమంజసమైనవే. కారణం ఆమె మేని రంగూ, కేశాల రంగూ ఒకటే కాబట్టి. "నీ ప్రాణనాథుడు ప్రాగ్దిశన ఉదయిస్తాడు" అని చెప్పటంలో ప్రత్యేకత ఏమైనా ఉందా? ఉందనే భావించాలి. ప్రభాకరుని కాంతిపుంజంలోనే ఆమె రూపసౌందర్యం సంపూర్ణంగా వెల్లడవుతుంది. రాత్రి వేళల్లో ఆమె నయనాలు, దంతాలు తెరిచి ఉంచకపోతే అంధకారంలో ఏకమైపోయిన ఆమె రూపాన్ని దర్శించటం అసాధ్యం. కొద్ది మసక మసక చీకటిలో ఆమె ఎదురుపడితే ఆమెనూ, ఆమె నీడనూ వేరుచేసి గుర్తించటమూ కష్టమే. "ఓ నా సప్తవర్ణ ఇంద్రచాపమా"అని ఆ చిత్రకారుడు రసికతలో ఆమెను సంబోధించడమే మహానుభావా..." అని ఆమె పరవశంలో అడగవచ్చు. తన జీవితంలో అటువంటి చిత్రాన్ని గాని చిత్రకారుణ్ణి గాని ఆమె చూసి ఉండలేదని, ఆయుదం గాని, లేదా వేపనూనె గాని, లేదా ఈ రెంటి మిశ్రిత ద్రవాన్ని గానీ తాగినట్లున్న ఆమె వదనాన్ని చూస్తేనే

అర్థమైపోతుంది. ఎన్నో అపహాస్యాలకు, హేళనలకు, అత్యాచారాలకు గురైన ఆ "ఎయిర్‌హోస్టెస్" ఒక శూర్పణఖగా పరిణమించిందని ఆమె నోరువిప్పి చెప్పకపోయినా ముఖం చూస్తే తెల్సిపోతుంది. పొట్టిపీపాగా ఆమెను సంబోధించడానికి కారణం ఎత్తు తక్కువగా, లావు ఎక్కువగా ఉండటమే. ఆమె బరువు దాదాపు ఎనభై అయిదు - తొంభై కిలోల మధ్య అంటే నిండు బస్తాకు ఒక పదో పదిహేనో కిలోలు మాత్రమే తక్కువ ఉంటుందన్నమాట.

అంత పొట్టిగా లావుగా ఉన్నా, నడిచే రీలుని గమనిస్తే ఆమెను శీఘ్రగామినిగా పేర్కొనవచ్చు. "డబ్బుకు లోకం దాసోహం" అన్న సామెత ఈమెకు పూర్తిగా వర్తిస్తుంది. రింగు రింగులుగా ఉన్న జుట్టును ఆరంగుళాలకు మించి పెరగనివ్వటానికి ఆమె ఇష్టపడదు. జీన్స్, టీషర్టు వేసుకున్న సమయాల్లో వెనుకనుంచి చూస్తే ఆమెను అబ్బాయిగానే భ్రమపడవచ్చు. చెవులకు మామూలుగా ధరించే రింగులు, కమ్మలే గాక, వాటికి కొంచెంపైన మరో చిన్న కమ్మల్ని గూడా ఆమె ధరిస్తుంది; వీటిని అదనపు దిద్దులనో, ఉపదిద్దులనో సంబావిద్దామా? తెలుపు రంగు రాయితో ఉన్న పుడక ఆమె బుర్ర ముక్కుకు అలంకారంగా అమరి ఉంది. ఆమె మామూలుగా వేసుకొనే "లిప్‌స్టిక్" చెడురక్తం రంగులో ఉంటుంది. అవసరానికి మించిన పౌడరు, రంగులతో నిండి ముఖం అదో తరహాగా ఉంటుంది. ఆమె చెక్కిళ్లపైనా, కనురెప్పలపైనా రంగుల అద్దకం మోతాదుకు మించి ఉంటుంది. మొత్తానికి ఆమెను చూస్తే సర్కస్‌లోని ఒక బఫూన్ సోదరి గుర్తుకు వస్తుంది. కానీ ఆమె భారీ శరీరాన్ని చూస్తే మాత్రం కుస్తీ వస్తాదురాలిగా దర్శనమిస్తుంది. చీరకట్టును మాత్రం నాభికి కొంచెం దిగువనే ఉంచాలనే ఆరాటం ఆమెలో ఉండి ఉండవచ్చు. కానీ నీటిలో నింపిన పెద్ద బెలూన్‌లాగా ఉండే ఆమె ఉదరం పైననే చీరకట్టకపోతే అది స్థానభ్రంశం అయి తీరుతుందన్న న్యాయమైన బెరుకు గూడా ఆమెలో ఉంది. పైకి కన్పించే ఆమె ఉదరాన్ని చూస్తే, పశువులకు మాదిరిగానే ఈమె జీర్ణాశయంలో గూడా ఎక్కువ అరలున్నాయేమోననే సందేహం రాకమానదు. ఈ సందేహాన్ని బుజువు చేయటానికన్నట్లుగా ఈమె గూడా ఎప్పుడూ "చూయింగ్‌గమ్"ను నములుతూ ఉంటుంది. ఆమె ముఖం ఎప్పుడూ అసంతృప్తి భావాన్నే ప్రదర్శిస్తూ ఉంటుంది. సమస్త జీవరాశులపట్ల ఆమె కనుకొలకుల్లో, పెదాల కొసల్లో కొట్టవచ్చినట్లుగా కన్పించే చులకన, ఏహ్యాభావాలను కళ్ళజోడు పెట్టుకోని దూదృష్టి వున్నవాళ్లు సైతం గమనించ గలుగుతారంటే అది వాళ్ళ దృష్టిలోపం మాత్రం గాదు.

దైనందిన ఉపయోగార్థం సౌందర్య సంవర్ధక పదార్థాలను ఏలోటూ లేకుండా ఆమె ఉపయోగించటంలో తగిన కారణాలున్నాయి. సాధారణ మానవులు నివసించే భూతలానికి

ఇరవై అయిదువేల అడుగులపైన ఆకాశంలో ప్రయాణం చేస్తున్న విమాన యాత్రికులకు ఆహార పానీయాలను అందీయటానికి అప్సర కన్యలు ఉంటేనే సమంజసంగా ఉంటుంది. కనీసం గంధర్వకన్యలో, కిన్నెర కాంతామణులో ఉన్నా ఫర్వాలేదు. ఇంతటి విశిష్ట సేవా కార్యక్రమానికి ఇటువంటి నల్లని పొట్టి పీపాను నియోగించినపుడు కొద్దిగానైనా అందంగా అలంకరించుకోవడం ఆమె వృత్తి ధర్మమే అవుతుంది.

అనామిక ఎయిర్‌హోస్టెస్‌గా పనిచేసే తొలిరోజుల్లో ఇంత లావుగా ఉండేది కాదు. కానీ నలుపురంగు ఆమెలో ఆత్మన్యూనతా భావాన్ని పెద్ద జేస్తూ వచ్చింది. విమాన ప్రవేశ ద్వారంలో నిలబడి వినమ్రతతో నమస్కరిస్తున్నప్పుడూ, మందస్మితంతో స్వాగతిస్తున్నప్పుడూ ఒక చచ్చిన ఎలుకను చూసినంత అసహ్యంగా ఆమెవైపు చూస్తారు కొందరు ప్రయాణికులు. కొందరైతే ఆమెను చూడనట్లే ప్రవర్తిస్తారు. ఈమె ప్రక్కన మరో ఎయిర్‌హోస్టెస్ ఉంటే ఆమెవైపు చిరుదరహాసం అనే పుష్పగుచ్ఛాన్ని కొందరు బహూకరిస్తే, మరికొందరు చిరకాలం పరిచయం ఉన్నట్లుగా, ఎంత బ్రేకు వేసినా ఆగని ఒక రోడ్ రోమియో నవ్వుచు ప్రదానం చేస్తూ పోతారు. అనామిక చాక్లెట్ ఇచ్చినా చాలామంది అయిష్టతను ప్రదర్శిస్తారు. ఈమె గనుక కాఫీని అందిస్తే, యాత్రికుల్లో అధిక భాగం "టీ" త్రాగేవారిగా మారిపోతారు. కానీ, అనామిక గనుక టీతో సిద్ధమైతే, మొత్తం విమానమే ఒక ఇండియా కాఫీ హౌస్‌గా మారిపోతుంది. కాక్‌పిట్‌లో ఆమెకు ప్రవేశం లేదు. కొంతమంది విమాన చోదకులకు ఆమె ఉన్న విమానానికి రావటానికే ఇష్టపడదు. వేరే ప్రమాదం ఏదీ జరగబోదన్న భరోసా ఉంటే మాత్రం ఆమెను అంతం చేయటానికి అంత ఖరీదైన విమానాన్ని కూల్చటానికి కూడా వాళ్ళు వెనుదీయరు. ఆమెకు ఎవరిదైనా యువకుని శరీరస్పర్శ తగిలితే ఏదో ఆకాశం ఊడిపడ్డట్లుగా బెంబేలెత్తిపోయి అతను "అయాం సారీ" అంటే "థ్యాంక్యూ" అన్నట్లుగా ఆమె భావించి "యు ఆర్ వెల్‌కం" అని పలికినా ఆ రసికహీనుడు మాత్రం మళ్ళీ ఆమెను స్పర్శించే సాహసం చేయడు.

ఉద్యోగంలో చేరిన తొలినాళ్ళలో తన ఇష్టం గానీ, అభీష్టం గానీ, ఏమాత్రం నెరవేరని నష్టజాతకాన్ని తల్చుకొని అనామిక కన్నీరు కార్చేది. అలా ఏడ్చి ఏడ్చి, అద్దం ముందు ఆమె నిల్చుంటే కన్నీళ్ళతో తడిసిన ఆ ముఖం ఆమెకే ఎంతో వికారంగా కన్పించేది. ఇదేమిటి? విలపించే సమయాల్లో ఈ ముక్కు ఇట్లా నల్లటొమేటో లాగా అయిపోతుంది!

"అనామికా, నీవు కొంచెం లావైతే నీ వంటి ఛాయ కొద్దిగా మెరుగవుతుంది" అని ఆమె స్నేహితురాలొకరు చెప్పటం జరిగింది. ఈ సలహాను సంపూర్ణంగా స్వీకరించి ఆమె భోజనాన్ని అధికంగా తీసుకోవటం జరిగింది. విమానాల్లోను, స్టార్ హోటల్స్‌లోనూ తిండికేమి

కొదవ? సెలవు దినాల్లో ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు బీరు తాగటం కూడా ఆమె మొదలు పెట్టింది. ఆమెను నివారించటానికి ఏదయ్యం గూడా ఆ అద్దె ఇంటిలో ఉండదు కదా! ఏది ఎట్లా ఉన్నా కొద్ది రోజుల్లోనే ఆమె శరీర పరిమాణం వృద్ధి పొందిపొంది ఒక డన్‌లప్‌పిల్లోగా తయారైంది. దీనికి ప్రత్యక్ష పరిణామ రూపంగా ఆమె నల్లని చర్మం కొద్దిగా తవుడురంగుతో మెరియసాగింది. ఇతరులు గూడా ఈ విషయాన్ని గమనించగలిగారు. నల్లగా, సన్నగా ఉన్న అమ్మాయికన్నా, నల్లగా, లావుగా ఉన్న అమ్మాయినే చాలామంది ఇష్టపడతారు. ఈ విధంగా నల్లగా పొట్టిపీపాలా ఉన్న అనామిక విమానంలో మరాళగామినిగా సంచరిస్తూ ఉంటే కొందరు చిరునవ్వుల కానుకను ఆమెకు ప్రసాదించసాగారు. వీరిలో కొందరు ఆమెతో సంభాసించటమే కాక, ఆమె ఇంటికి ఆహ్వానంలేని అతిథులుగా గూడా వెళ్ళటం జరిగింది. కానీ, ఇటువంటి పరిచయాలు చివరకు చేదు అనుభవాన్నే ఆమెకు మిగిల్చేవి. ఈ అనుభవాలే ఆమెను పురుషద్వేషిగా మార్చివేశాయి.

విమాన ప్రయాణీకులలో ఆమె చాలా పరుషంగా మాట్లాడేది. ఒకరోజు ఆమె టీ అందిస్తుండగా ఒక వయసు మళ్ళిన వ్యక్తి ఎంతో మర్యాదపూర్వకంగా, తాను టీ కాఫీలు తీసుకోనని, ఒక కప్పు పాలు ఇస్తే తీసుకుంటానని అన్నాడు. వెంటనే ఆమె "ఎటువంటి ప్రయాణికులు వస్తున్నారు, నేడు ఎయిర్‌హోస్టెస్‌లు తల్లిలా పాలు పట్టాలని వాళ్ళు ఆశిస్తారు" అంటూ బిగ్గరగా నవ్వింది. ఆ వృద్ధుని ముఖం అతను కోరిన పాలలాగే తెల్లగా పాలిపోయింది. ఆమెతోపాటు ఇద్దరు ముగ్గురు నవ్వినా, మిగతా ప్రయాణికులు మాత్రం "శూర్పణఖ" కు మారుగా ఆమె "పూతన" అయివుంటే బాగుండేదని భావించారు.

విమానం తన సొంత సొమ్మన్నట్లుగా ఆమె ప్రవర్తించేది. తమ సీటు నెంబరును సరిగా తెల్సుకోలేని ప్రయాణీకులను ఆమె చాల చులకన చేసి మాట్లాడేది. సరైన సమయంలో సీటు బెల్టు కట్టుకోని పాసింజర్స్‌ను ఆమె మందలించేది. విమానం పైకి లేచేటప్పుడు గాని, క్రిందకు దిగేటప్పుడు గాని ఎవరి సీటైనా వెనుకకు వాలి ఉంటే ఆమె అతన్ని సాధించి గాని వదిలేది కాదు. ఆహార పానీయాలను సరఫరా చేసే సమయాల్లో, ఎవరైనా బాత్‌రూం వైపు అడుగులు వేస్తే, ఫుటబాల్ ఆటలో ఫుల్‌బ్యాక్‌లా ఆమె అతన్ని అడ్డుకొని వెనక్కు పంపేది. ఆమె అమర్యాదకర ప్రవర్తన గూర్చి కొందరు కంప్లైంట్ చేయటం, దాని ఫలితంగా ఆమె లిఖిత పూర్వకంగా తాఖీదు లందుకోవడం గూడా జరిగింది. దానివల్ల ఆమె మొండివైఖరి మరింత బలపడింది.

ఒకరోజు విమానంలో దాదాపు ఇరవై అయిదు సీట్లు ఖాళీగా ఉన్నాయి. అయినా సామాను పెట్టుకోటానికి పైన స్థలం ఏ మాత్రం లేకుండా ఉంది. ఒక ప్రయాణీకుడు తన

సూట్‌కేసును ఖాళీగా ఉన్న ప్రక్కసీటు మీద పెట్టుకొన్నాడు. ఇది గమనించిన మన శూర్పణఖ ఆ సూట్‌కేసును తీసి, ముందు సీటు క్రింద పెట్టమని ఆ ప్రయాణికుణ్ణి గద్దించింది. అతడామె చెప్పినట్లే చేయబోయాడు గానీ ఆ సూట్‌కేసే అందుకు సహకరించలేదు. ఆ సూట్‌కేసును ముందు వెనుకా సీట్ల మధ్య ఉన్న జాగాలో నిలబెట్టి ఉంచాడతను. "నో...నో... అట్లా ఉంచటానికి వీల్లేదు, సీటు క్రిందనే ఆ సూట్‌కేసు నుంచాలి అంటూ ఒక కోపిష్టి పంతులమ్మలా ఆదేశించింది. "ఈ సూట్‌కేసు కొంచెం పెద్దది కావటం వల్ల సీటు క్రింద సాధ్యం కాదు" అంటూ అతను వివరించినా "ఏమైనా ఇట్లా ఉంచటానికి మాత్రం నేను అంగీకరించను, దానిని సీటు క్రిందే పెట్టాలి" అంటూ సుప్రీంకోర్టులా ఆమె తీర్పు చెప్పింది. ఖిన్నుడైన ఆ ప్రయాణికుడు అతి కష్టం మీద ఆ సూట్‌కేసును సీటు క్రింద సర్దాడు. అట్లాపెట్టటం వల్ల ఎంతో కొంత ఆ సూట్‌కేసు పాడై ఉంటుందన్న సంతోషంతో ఆమె మరోవైపుకు తిరిగింది. ఆవైపు నల్లని రంగులో ఉండి, వెంట్రుకలన్నీ తెల్లబడిపోయి ఉన్న ఒక ప్రయాణికుణ్ణి చూసి, నెగెటివ్ ఫోటోలా ఉన్నాడనుకొని తనలో తాను నవ్వుకొంది. అతను కిటికి దగ్గర సీట్లో కూర్చొన్నాడు. ప్రక్క రెండు సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఆ ఖాళీ సీట్లపై పొడుగైన ఒక నల్లటి బ్యాగ్ హాయిగా పరుండి ఉంది. ఆ ముసలాయన్ను కూడా కొంత ఏడిపించాలని అనామిక ఆరాటం. కారణమేమిటంటే, సీటు బెల్ట్ కట్టుకొని అతను సుఖంగా ఉన్నట్లు కన్పిస్తున్నాడు. అతనివైపు చురచుర చూస్తూ "మీరు లేచి ఈవైపుకు రాండి" అంటూ ఇంగ్లీషులో ఆజ్ఞాపించింది. సీటు బెల్టు కట్టుకొన్న విషయం మర్చిపోయిన ఆ వృద్ధుడు లేవటానికి ప్రయత్నించి మరల సీటుపై కూలబడిపోయాడు. టక్కున కూర్చొండిపోవడం వలన కుర్చీ అతని చేతికి గట్టిగా తగిలి నొప్పి గూడా చేసింది. "నేను చెప్తున్నది మీకే, లేచి రండిటు" అంటూ ఆమె మళ్ళీ చెప్పేటప్పుడు నమ్మలేనట్లుగా కోపంగా ఆమెవైపు చేశాడు.

"ఇటురా... ఇటురా... అంటూ నన్ను పిలవటంలో అసలు నీ ఉద్దేశ్యమేమిటి?" అంటూ అతను ఇంగ్లీషులో అడిగాడు. "ఇందులో మీకు తెలియకపోవడానికి ఏముంది? మీరు లేచి ఇటు రావల్సిందే" అని ఆమె గట్టిగా అంది. "విమానంలో ప్రయాణించడం నాకిది మొదటిసారి కాదు, ఇంతవరకు ఏ ఎయిర్‌హోస్టెస్ గూడా నాతో ఇంత అమర్యాద కరంగా మాట్లాడలేదు" అంటూ అతను మెల్లగా ప్రక్కకు వచ్చాడు. అంతవరకు ఆ వృద్ధుడు సుఖంగా కూర్చొన్న కిటికీ ప్రక్క సీటులో, ఆ పొడుగాటి బ్యాగ్‌ను పెట్టి దాన్ని బెల్ట్‌లో బిగించింది అనామిక. ఆ ప్రక్కనున్న ఖాళీ సీట్లు వృద్ధుడికి చూపిస్తూ "మీరిక వాటిమీద కూర్చోవచ్చు" అంది.

"సీటు మీద పెట్టకూడదంటూ నా బ్యాగ్‌ను సీటు క్రింద పెట్టించారు కదా! మరి ఆ

బ్యాగ్‌ను సీటుపైన ఎట్లా పెట్టించారు? అంటూ ఇవతలవైపు ప్రయాణికుడు కోపంతో ఆమెను ప్రశ్నించాడు.

"రూలు అట్లా ఉంది, ఇందులో నేను చేసేదేమి ఉంది?"

"కుడి ప్రక్క ఒక రూలూ, ఎడం ప్రక్క మరో రూలూనా?" అంటూ అతను ప్రశ్నించటంతో పక్కనున్న ప్రయాణికులంతా పకపకా నవ్వారు.

"ఇదీ ఓ జోకేనా సార్... మరి నేను గూడా నవ్వాలా?" అని ఆమె ప్రశ్నిస్తుంటే ఒక ప్రయాణికుడు ముప్పావు నవ్వు నవ్వితే, మరో ప్రయాణికుడు ఒక పావు నవ్వు నవ్వాడు.

"నవ్వటం నీకు తెల్సుంటే నీవు నవ్వొచ్చు" అన్న అతని మాటలు వినటంతో ప్రయాణికులంతా గొల్లుమని నవ్వారు. అనామిక ముఖంపై ఒక కారు మేఘం కమ్మివేసింది. ఒక్క క్షణం గూడా అక్కడ ఉండకుండా ఆమె వెళ్ళిపోయింది. కొంచెం సేపైన తర్వాత ఆమె తెచ్చిన ఆహారపానీయాలని ఆ ఇరువురు యాత్రికులు ముట్టనేలేదు. రోజులు గడిచే కొలది అనామిక "అనీతిక"గా మారజొచ్చింది. మొదలే పురుషద్వేషి అయిన ఆమె ఇప్పుడు సర్వజన విద్వేషిగా దూర్వాసుని వంటమనిషిగా తయారైంది. ప్రతి రోజు రెండు మూడు కొట్లాటలైనా పెట్టుకోకపోతే ఆమెకు నిద్రే రాదు. నిద్ర పట్టేముందు ఆ రోజు ఆమె జరిపిన కొట్లాటలు గుర్తుకు వస్తే, పడుకున్న పరుపుతో కూడా ముష్టియుద్ధం చేయల్సివచ్చేది ఆమెకు. తన యీడున్న స్త్రీలు భర్తల కౌగిళ్లలో సుఖంగా నిద్రపోయే విషయం గానీ, దంపతుల మధ్య ఉన్న చిన్న ఎడంలో చిన్నారి బాలల చిరు దరహాసంతో నిద్రపోయే విషయం గాని ఆమె మనసులోకొస్తే చాలు, ఇహ నిద్రనేది ఒకవేడి నిట్టూర్పులా వెడలిపోయేది. ఎక్కువ రాత్రులు రెండు మూడు పెగ్గుల విస్కీనో, బ్రాందీనో లేక నిద్రమాత్రలనో ఆమె ఆశ్రయించవలసి వచ్చేది.

తాను కొట్లాటలు పెట్టుకొన్న, లేదా చూసీ చూడంగానే తనకు కోపం తెప్పించిన విమాన యాత్రికుల పానీయాల్లో ఆమె రహస్యంగా విరేచన మందు కలిపేది. ఆ పానీయాలు తాగిన వాళ్ళు రెండు మూడు సార్లు పరుగువంటి నడకతో బాత్రూంల వైపు వెళ్ళటం చూసి పరిహాస హాసంతో ఆమె ముఖం నిండిపోయింది. కొద్ది రోజులు గడిచిన తర్వాత అనామిక సహ ఎయిర్‌హోస్టెస్‌లకు ఆమె అసలు రుగ్మత ఏమిటో తెల్సిపోయింది. ఈ విషయంపై వాళ్ళు ఎంతగా చర్చించినా, నచ్చచెప్పబోయినా, తాను చేస్తున్న పనిని మాత్రం ఆమె అంగీకరించేది కాదు.

ఒకరోజు మామూలుగానే ఆమె ఒక యాత్రికునితో ఘర్షణ పడుతూండటం చూసి,

పైలెట్ వచ్చి అందరి ముందూ ఆమెన మందలించడం జరిగింది.

కాక్‌పిట్ లోకి పైనాపిల్ జ్యూస్ తీసుకువెళ్తున్న ఎయిర్ హోస్టెస్‌ల గ్లాసులలో గూడా అనామిక రహస్యంగా విరేచనమందు కలిపింది. అతి శీఘ్రంగా ప్రభావం చేపే ఆ మందు పైలెట్‌ను, కోపైలెట్‌ను రెండు మూడు సార్లు లేవెట్రిన్‌వైపు పంపించింది. తమకు పానీయాన్ని అందించిన హోస్టెస్‌ను పిలిచి దర్యాప్తు చేశాడు పైలెట్. తర్వాతి కార్యక్రమాలు అత్యంత గోప్యంగా జరిగిపోయాయి. విమానాశ్రయంలో ఆగిన విమానం నుండి ప్రయాణికులు దిగిన వెంటనే ఇరువురు మహిళా పోలీసులు విమానంలోపలికి వచ్చి అనామికను సోదా చేయడం జరిగింది. ఆమె వెనిటీ బ్యాగ్ నుండి విరేచన మందు ఉన్న చిన్న చిన్న పొట్లాలను గూడా వెలికి తీశారు.

తర్వాత జరిగిపోయిన విషయాలను వివరించాల్సిన అవసరమే లేదు. ఉద్యోగం నుండి ఊడగొట్టబడిన అనామిక విరేచన ఔషధాలు మాత్రమే అమ్మబడే దుకాణానికి యజమానురాలుగా, ఆతురోదరపరిసేవనా చర్యలతో తన శేష జీవితాన్ని పునీతం చేసుకొనే మహాప్రయత్నంలో నిమగ్నమై ఉన్నదేమో!